# శ్రీదేవి-భూదేవి

అందరికి ఇంత అన్నం పెడుతుంది భూదేవి. అలసిసొలసి ఉన్నవారిని తన వొడిలో సేదదీర్చి నిద్రపుచ్చుతుంది. కాని దాన్ని కాళ్లతో తన్నుకుంటూపోతాడు మనిషి. సొంత లాభం కోసం దాన్ని ఎంతైనా హింసిస్తాడు.

తన ఆడంబరంతో, ఆకర్షణతో అందరినీ వశపర్చుకుంటుంది శ్రీదేవి. అయినవాళ్ల మధ్య కూడా కలతలు రేపుతుంది. తను తప్పిస్తే వేరే లోకం లేదన్న భ్రమ కలిగిస్తుంది. అయినా దాన్ని నెత్తిమీద పెట్టుకు పూజిస్తాడు మనిషి. దాని కటాక్షం కోసం ఏ పనైనా చేస్తాడు....

ఇది లోక ధర్మం

ఏ ధర్మాన్నైనా అతిక్రమించవచ్చునేమో గాని, ఎటువంటి వాడూ కూడా ఈ లోకధర్మానికి మటుకు అతీతుడు కాలేడు.

ఉదయం పదిగంటల వేళ రాజమ్మ భోజనాలు చేసిన ఎంగిలి విస్తరాకులు ఎత్తి, చెత్తడబ్బాలో పడవేస్తుంటే ఎర్రగా, పీలగా, పొడుగ్గా వున్న కుర్రాడు ఒకడు ఎంతో దీనంగా, మరెంతో నమ్రతగా అడుగులు వేస్తూ ఆమె దగ్గరికి వచ్చి నిలబడ్డాడు.

"ఎవరు నాయనా! ఏం కావాలి?" అంటూ అప్యాయంగా పలకరించింది రాజమ్మ, అంట్ల చేయి పైటకొంగుకి తగలకుండా జాగ్రత్తపడుతూ.

"నేను గంటివారి అబ్బాయినండి. నాపేరు గోపాలం. మాది జంగాలవలస అగ్రహారం. ఇక్కడ కాలేజిలో చదువుకోవాలని వచ్చేను. హాస్టల్లో ఉండి చదువుకోడానికి మాది అంత కలిగిన కుటుంబం కాదు. నా వెనుక చదువుకోవలసిన ఇద్దరు తమ్ముళ్లు ఉన్నారు. పెళ్లి కావలసిన ఆడపిల్లలున్నారు. ఏదో మీలాంటి వారు దయతలచి ఆదరిస్తే... ఈ పేద విద్యార్థికి విద్యాదానం చేసిన పుణ్యం ఊరకేపోదండి."

అదివరకే ఎందరిముందరో అప్ప చెప్పిన పాఠంలా ఆ కుర్రాడు గుక్క తిప్పుకోకుండా అలా చెప్పుకుపోతుంటే రాజమ్మ వింతగా చూసింది. "మాదీ మరేమంత భారీ సంసారం కాదులే నాయనా! ఏదో ఆ భగవంతుడి దయవల్ల తిండికి బట్టకి లోటులేకుండా కాలక్షేపం అయిపోతున్నాది కాని" అంది.

ఎదురుగా ఆమెవంక ఆశతో చూస్తూ నిల్చిన ఆ పిల్లడు ఎండకు వాడిన లేత చిగురులా కందిన ముఖాన్ని కిందికి వాల్చుకొని ఏమనేందుకు తోచనట్లు కాలిబొటనవేలుతో నేలరాస్తూ అలా ఉండిపోయేడు.

అమాయకంగా, లేతగా వున్న ఆ పిల్లడిని చూస్తే రాజమ్మకి జాలి వేసింది. అతన్ని ఆ పరిస్థితిలో నిలబెట్టిన లేమిని తలచుకొంటే ఒళ్లు జలదరించింది. తన వల్ల అతనికి సహాయం జరిగేమార్గం లేదని చెప్పవలసి వచ్చినందుకు తన అశక్తత మీద తనకే కోపం వచ్చింది. ఆరాటాలన్నిటినీ పుక్కిటపట్టి, ఒందుమన్ను అడుగంటేక తేటతేరిన వరదనీటిలా నిర్మలంగా ఆ కుర్రాడివంక చూస్తూ అడిగింది.

"ఇంతకి నీకేం కావాలి నాయనా"! అంటూ

"కాలేజి జీతానికి స్కాలర్‌షిప్ ఉందండి. తిండికి వారంలో ఆరురోజులు వారాలు కుదిరేయి. మిగిలిన ఆ ఒక్క రోజూ మీ ఇంట వారం యిస్తే... రెండు పూటలా పట్టెడన్నం. అంతకు మించి మిమ్మల్ని ఏమీ కోరనమ్మా".

అన్నం కోసం 'దేహి' అని అడగడం ఆ కుర్రాడికి అంతకుపూర్వం అలవాటు లేదులాగుంది. ఆ మాట అంటుంటే అతడి కంఠం వణికింది. కళ్లలో నీళ్లు తిరిగేయి.

అప్పటికింకా కరువు కాటకాలు దేశంమీద అంతలా విరుచుకుపడలేదు. రెండో ప్రపంచం యుద్ధం కూడా భూమి మీద తన విహారాన్ని ఇంకా మొదలుపెట్టలేదు. తిండికోసం నోరు విడిచి అడుగుతూ గుమ్మం ముందుకు వచ్చిన ఆర్తుడికి పట్టెడన్నం పెట్టకుండా పొమ్మనే అలవాట్లు ఇంకా అంతగా చలామణిలోకి రాని రోజులు అవి. ఆ కుర్రాడు అలా అడుగుతుంటే రాజమ్మ కాదనలేకపోయింది.

"అలాగేలే బాబూ! మాతోపాటు గంజో, కడుగో ఏదుంటే అది

తాగుదువుగాని.... ఏ రోజున వస్తావో చెప్పు" అంది రాజమ్మ

"మీ మేలు ఎప్పటికీ మరచిపోనమ్మా. మీ ఇంట భోజనానికి మంగళవారం నాడు వస్తాను. నమస్కారమమ్మా" అంటూ ఆమె దగ్గర సెలవుతీసుకొని వెళ్లిపోయేడు గోపాలం.

మంగళవారం నాడు భోజనాల సమయంలో విస్తళ్లు వేస్తున్న చిన్నకూతురితో "ఆపక్కగా మరో ఆకు వెయ్యి" అంది రాజమ్మ. నూతిదగ్గర కాళ్లు కడుక్కొని వాకిలి చుట్టివచ్చి వరండాలో అరుగుమీద కూర్చున్నాడు గోపాలం.

"ఎవరమ్మా ఈ చుట్టం" అంది సీత తల్లితో మెల్లగా.

"ఆ పిల్లడి పేరు గోపాలంట. వారాలు చేసుకొంటూ కాలేజీలో చదువుకొంటున్నాడట. మనింట ఒక వారం కావాలంటే సరే అన్నాను. ఇక నుంచి ప్రతి మంగళవారం వస్తుంటాడు. కాస్త గుర్తుంచుకో" అంది రాజమ్మ.

"అయ్యో పాపం రోజుకో ఇంట తిండా?" అనుకొంది శాంత అతడివంక జాలిగా చూస్తూ

రాజమ్మకి నలుగురు పిల్లలు. శాంత పెద్దపిల్ల. సీత రెండవది. ఆ పిల్ల వెనుక ఇద్దరు మగపిల్లలు. రాము, గోపి, సన్నగా, పొడుగ్గా గడకర్రలా ఉంటుంది శాంత. శరీరవర్ణం చామనఛాయ. ఆరేళ్ల పిల్లగా ఉన్నప్పుడు స్ఫోటకం వచ్చి తలలో అక్కడక్కడ కుండలు వేసేయి. ఆ స్థలంలో తిరగి జుట్టు మొలవలేదు. ఎంతో కాలంగా మరామత్తులేని తారురోడ్డులా ఎత్తుపల్లాలుగా గుంటలు మాత్రం మిగిలేయి. అక్కడ శరీరం కన్పించకుండా మిగిలిన జుట్టునే నున్నగా దువ్వి, తలంతా పరిచేలా సర్ది, గట్టిగా బిగించి జడవేసుకుంటుంది శాంత. పలుచని తలకట్టువల్ల ఆ పిల్ల బుర్ర మరీ చిన్నదిగా పొడుంకాయగా కోలగా కన్పిస్తుంది. ముక్కు కొంచెం చప్పిడి. లోతైన గుండ్రని కళ్లు. చిన్న నోరు, సూదిగా కొనదేలిన గడ్డం, ఇదీ శాంత బాహ్యారూపం.

నోరువిప్పి మాట్లాడేవరకు, మన స్ఫూర్తిగా నవ్వేవరకు శాంతలో దాగున్న అందాలేమిటో ఎదుటివారికి ఏమాత్రం తెలిసిరావు. ముళ్లడొంకల మధ్య అప్పుడే

విచ్చుకొంటున్న గోరింట పువ్వులా ఈ అనాకారి మనిషి నవ్వులో ఇంత అందాన్ని ఆ దేవుడు ఎలా పదిలపర్చాడా - అనిపిస్తుంది. ఆ నవ్వు చూసిన వారికి. కాని, దేవుడిచ్చిన ఆ వరాన్ని కూడా సరిగా ఉపయోగించుకొని ఎదుటివారి నుండి మెప్పు పొందేపాటి తెలివితేటలైనా ఆ పిల్లకి లేవు. ఎప్పుడూ మౌనంగా, ఏదో యంత్రంలా తల్లి పురమాయించిన పనులన్నీ ఆయాసం, విసుగూ అన్నమాట లేకుండా చేసుకుపోతుండడమే శాంతకి తెలుసు.

సీతదంతా తల్లి పోలిక. వెడల్పయిన ముఖం. సూదిముక్కు. పెద్దకళ్లు ఒత్తయిన తలకట్టు. ఛాయ కూడా శాంతకన్న బాగా మెరుగు. అక్కలా అయిదో క్లాసుతోనే చదువుకు స్వస్తి చెప్పకుండా తల్లితో పోట్లాడి హైస్కూల్లో ప్రవేశించింది. నీటుగా, చలాకీగా  ఎదుటివారిని ఇట్టే ఆకర్షించేలా ఉంటుంది సీత.

భర్త రంగనాథం ఊర్లోలేని కారణాన పిల్లల పంక్తినే గోపాలానికి కూడా వడ్డన చేసింది రాజమ్మ. పులుసులోకి మరికాస్త అన్నం మారువేస్తూ "నీ బసెక్కడ బాబూ?" అంటూ ప్రశ్నించింది.

"ప్రస్తుతానికి దేవస్థానం వారి సత్రంలో ఉంటున్నానండీ. కాని వాళ్లు అట్టే రోజులు ఉండనిచ్చేలా లేదు. ఎక్కడైనా చిన్నకొట్టు అద్దెకు చూసుకొని వెళ్లిపోవాలనుకొంటున్నాను. మీఎరికెలో ఏమైనా ఉన్నాయాండీ" అన్నాడు గోపాలం పులుసు అన్నం కలుపుకొంటూ.

"చూసి చెప్తాలే నాయనా" అంది రాజమ్మ

ఆ మాట అంటూండగానే రాజమ్మ మనసులోకి ఒక ఆలోచన వచ్చింది. కాని భర్తతో ఆలోచించకుండా ఏ మాటా అనడం ఇష్టం లేక అప్పటికి ఊరుకొంది.

రంగనాథంగారిది తాతలనాటి ఇల్లు. ఒక వావీ, వరుసా లేకుండా వాకిళ్లు, వరండాలు, మూలకొట్లు, నడసావిళ్లు అన్నట్లుగా ఉంటుంది. అంతా తమకిందే ఉంచుకొందికి పెద్దది, అద్దెకి ఇచ్చేందుకు సదుపాయం లేదు. నెలరోజులకోసారి ఇల్లు కడుగుతున్నప్పుడల్లా "ఏం ఇల్లో నాకూ నా ప్రాణం పుచ్చుకొంటున్నది. దీన్ని హాయిగా

తెగనమ్మి పారేసి ఏ అద్దె ఇంట్లోకైనా పోయినా బాగుండును" అంటూ వర్ణిస్తుంది రాజమ్మ. తాతలనాటి ఆ ఇల్లంటే రంగనాథానికి ఒక విధమైన మమకారం ఉంది. ఆ కారణంగానే ఏ విషయంలోను భార్య మాట కాదనని వాడు ఆ ఇల్లు అమ్మడం విషయంలో మాత్రం ఆమె మాటల్ని చెవిన వేసుకోకుండా తప్పుకుపోతుంటాడు.

క్యాంపునుంచి భర్త రాగానే రాజమ్మ గోపాలం బస విషయం బయటపెట్టింది. "కుర్రాడు మంచివాడులాగున్నాడు. వాకిలికి ఆ పక్కగా వున్న వరండాలో ఉండమంటే ఏంపోయింది? మంచికైనా, చెడ్డకైనా పిలుస్తే ఆ మాత్రం పలుకుతాడు. వచ్చి ఉండమంటే పుణ్యం, పురుషార్థం రెండూ కలిసొస్తాయి" అంది.

రంగనాథానికి భార్య అన్నమాట బాగుందనిపించింది. తనదేమో నెలకి ఇరవై రోజులకి పైగా ఊళ్లమీద తిరిగే ఉద్యోగం, లంకంత ఇంటిలో ఆపాటి వయసొచ్చిన కుర్రాడు ఒకడు ఉండడం మంచిదే అనుకొన్నాడు.

రాజమ్మ ఆలోచన ఫలితంగా మూడో నాటికి గోపాలానికి రంగనాథంగారింట వసతి సౌకర్యం ఏర్పడింది. ఆ దంపతులు తనమీద పెట్టిన నమ్మకాన్ని పోగొట్టుకోకుండా మంచిగా, మర్యాదగా కాలక్షేపం చేసుకుపోవాలనుకొన్నాడు గోపాలం.

దసరా సెలవలకి గోపాలం తన ఇంటికి వెళ్లినపుడు ఆ ఇంటివారి ఆదరాభిమానాలగురించి, తలిదండ్రులతో గోరంతలు కొండంతలు చేసి చెప్పి, మరీ వచ్చేడు. పరాయి ఊళ్లో పిల్లాడికి ఆపాటి ఆదరించే మనుషులు దొరికినందుకు వారెంతో సంతోషించేరు.

గోపాలం వారింటచేరిన నాలుగు నెలలనాటి మాట, ఒకరోజు రాత్రి అలవాటుకు భిన్నంగా అతడు రావడం కాస్త ఆలస్యం అయింది. ఇల్లంతా చీకటిగా, నిశ్శబ్దంగా ఉంది. ముందు చావిట్లో మాత్రం హరికెన్ లాంతరు ఇనుపగజానికి కిందుగా వేలాడుతున్నది. ఆ చిరువెలుగులో కూర్చొని శాంత ఏదో అల్లకపని చేస్తున్నది. ఆమె దృష్టిలో పడకుండా మెల్లగా పిల్లిలా అడుగులు వేసుకొంటూ తన

భాగంలోకి వెళ్లిపోవాలనుకొన్నాడు గోపాలం. కాని ఆపాటి అలికిడికే శాంత తలయెత్తి, ఇటు తిరిగి చూసింది. "ఈరోజు బాగా రాత్రయిందే," అంది ఆమె తన చేతిలోని అల్లికపనిని మడచిపెడ్తూ.

ఆమె తన కోసమే ఎదురుచూస్తూ అలా కూర్చున్నట్లు అనిపించింది గోపాలానికి. ఎందువల్లో ఆ ఆలోచన రాగానే అతడి మనసులోకి ఆనందం, ఉత్సాహం నూతిలో జలపడ్డట్లు గలగలమంటూ వచ్చిపడ్డాయి. ఎంతో భాదనుండి ఉపశమనం కలిగినట్లు, మనసులోని ఆరాటం, ఒంటిలోని బడలిక తీరినట్లు అన్పించింది. కాని అంతలోనే ఆ భావం ఆవిరిగామారి, ఆ శూన్యంలోంచి కారణం లేని కంగారు బయలుదేరింది.

"నోట్సు కాపీ చేసుకొంటే వేళ తెలిసి రాలేదండీ, ఇంకా ఏడో, ఎనిమిదో అయిందనుకొన్నాను. తీరా చూస్తే... పది. క్షమించాలి. ఇంకెప్పుడూ ఇలా మీకు ఇబ్బంది కలుగచెయ్యను" అన్నాడు గోపాలం తడి ఆరిన గొంతుకతో మాటలు తడబడుతూ.

"ఇంకా ఏదైనా సినిమాకి కాని వెళ్లేరేమో అనుకొన్నాను" అంది శాంత అతడివంక పరీక్షగా చూస్తూ.

"లేదండీ... టెక్స్టు పుస్తకాలన్నీ కొనాలంటే చాలా డబ్బవుతుంది. అందుకని" నేను అబద్ధం చెప్పడం లేదన్నట్లు చేతిలో ఉన్న పుస్తకాలవంక చూస్తూ అన్నాడు అతడు.

"రండి... భోజనం చేద్దురుగాని" గజానికి ఉన్న హరికేన్ లాంతరు చేతిలోకి తీసుకొంటూ అంది శాంత.

వాడిఉన్న అతడి ముఖం ఆ వెలుగులో ఒకసారి మెరసినట్లుయింది. మళ్ళీ అంతలోనే నూనె అయిపోతున్న దీపంలా కాంతి తగ్గిపోయింది. "ఈరోజు మీ ఇంట వారం కాదు కదండీ" అన్నాడు నెమ్మదిగా.

"ఆ సంగతి గుర్తుంది కాని అన్నం కొద్దిగా మిగిలుంది. మీ ముఖం చూస్తే

మీరీపూట భోజనం చేసినట్లులేదు... వడ్డిస్తాను కాళ్లు కడుక్కురండి"

అతడి జవాబు కోసం ఎదురుచూడకుండానే శాంత వంట ఇంటివైపు దారితీసింది. అతడు ఆ పూట భోజనం చెయ్యనిమాట నిజమే. వేళమీరి వెళ్లడం వల్ల ఆరోజు అతడికి వారం ఉన్న ఇంట భోజనం దొరకలేదు. "అయ్యో నాయనా! ఇప్పటివరకూ వస్తావేమోని చూసి, చూసి ఇప్పుడే ఆ మాధాకబళం వాడికి పడవేసేను. ఆలస్యంగా వచ్చే రోజున కాస్త ముందుగా చెప్పిపోతుండు బాబూ" అంది ఆ ఇల్లాలు.

ఆకలి సంకోచాన్ని ఆవలికి నెట్టింది. మారుమాట లేకుండా శాంత వెనుకనే వెళ్లి పీట వాల్చుకొని కూర్చున్నాడు. అభిమానంతో వడ్డిస్తున్న శాంత చెయ్యి ఆరోజు గోపాలం విస్తర్లో అమృతాన్ని వర్షించింది.

"ఈరోజు వంటకి కొత్త రుచి వచ్చింది" అన్నాడు గోపాలం పులుసు కలుపుకొంటూ

"అది మీ ఆకలి రుచి, అంతకన్న మరేంలేదు" అంది శాంత

మరునాడు అతడికి అసలు విషయం తెలియవచ్చింది. నెలనెలా రాజమ్మ వాకటున్నప్పుడు శాంత వంట చేస్తుంది. తల్లి వంటకన్నా కూతురి వంట రుచిగా, మంచిగా ఉన్నట్లు అన్పించింది గోపాలానికి.

"మీ అమ్మాయిని ఏ అదృష్టవంతుడు చేసుకొంటాడో కాని కడుపునిండా రోజూ కమ్మని భోజనం చెయ్యొచ్చు" అన్నాడు గోపాలం శాంత వంటపట్ల తన మెప్పుదలని రాజమ్మ ముందు వెల్లడిస్తూ

తన వంటకన్న కూతురివంట బాగున్నాదన్నట్లు అతడు అలా మెచ్చుకొంటుంటే ఆ తల్లికి కోపం రాలేదు. కడుపున పుట్టిన పిల్ల చేతిలో ఓటమిని తన విజయంగానే భావించి మనసునిండుగా నవ్వింది. "ఒక్క వంటే అన్నమాటేముంది? మా శాంత ఏ పనిచేసినా తీర్చిదిద్దినట్లుంటుంది ఓ అల్లికలా, కుట్లూ, ఇంటిపనా, ఒకటేమిటి.... కాస్త ఛాయ తక్కువన్న మాట కాని నా బిడ్డ ముఖం ఎంత కళగా ఉంటుంది" తన కూతురి గుణగణాల్ని గుక్కతిప్పుకోకుండా గోపాలం ముందు ఏకరుపు పెట్టింది రాజమ్మ.

తిరిగి నిండా ఒక గంట అయినా గడవక ముందే "ఓ చవిటికాళ్ల పెద్దమా... ఓ మొద్దావతారమా... కాస్త బుర్రపెట్టుకు వినవే... మనిషినన్న మాట మరిచిపోకే" అంటూ రాజమ్మ కూతుర్ని తిట్టిపొయ్యడం గోపాలం విన్నాడు. శాంతను చూసుకోడానికి అప్పటప్పట వస్తున్న పెళ్లి కొడుకుల ముందు వర్ణించే మాటలు పొరపాటున రాజమ్మ తనతో అని ఉంటుందేకాని... అంతకుమించిన మెప్పుదల కూతురి పనిపట్ల ఆమెకి లేదనే నిశ్చయానికొచ్చేడు గోపాలం.

సీత కొద్దిగా సంగీతం నేర్చుకొంది. శ్రావ్యంగా, లయబద్ధంగా పాడగలదు. శాంతకి సంగీతం అంటే ఏమిటో తెలియదు. కాని ఇంట్లో పనిపాట్లు చేసుకొంటూ ఏవేవో పాటలు మెల్లిగా తనలో తనే పాడుకొంటుంది. గోపాలానికి రాగ, తాళబద్ధంగా నడిచే సీత పాటకన్న శాంత ఎవరికీ విన్పించకుండా మెల్లమెల్లగా తీసే కూనిరాగాలే వినాలని ఉంటుంది.

సీతపాటలో శాస్త్రం ఉంది. తన పాటలో ఎదుటివారి దృష్టిని ఆకట్టుకోగల శక్తి ఉంది. ఆ పిల్లపాట విన్న ఎవరికైనా, సాధనచేస్తే బాగా అభివృద్ధిలోకి రాగల కంఠం- అన్న తలపు కలుగుతుంది. శాంత సీతలా ఎవరిముందు పాడదు. అసలు తను పాడగలనన్న విషయం కూడా ఆ పిల్లకి తెలిసి ఉండదు. కాని ఆమె కంఠంలో నాదం ఉంది. ఆమె పలుకులో లాలిత్యం ఉంది. మనసుల్ని సూటిగా తాకే మాధుర్యం ఉంది ఆమె పాడే తీరులో.

గోపాలానికి ఈ తేడాలేమి తెలియవు. అతనికి తెలిసిందల్లా ఒక్కటే సీత పాట వింటుంటే జనంతో కిక్కిరిసిన సభలో కూర్చొని ఏదో పాటకచేరి వింటున్నట్లుంది. శాంత పాట విన్నప్పుడు అమ్మ పాడిన లాలిపాటలా చెవులకి హాయిగా విన్పిస్తుంది.

రంగనాథం, రాజమ్మ ఇంటికి వచ్చిన బంధుమిత్రుల ఎదుట తమ చిన్న కూతురి పాట ప్రస్తావన తెచ్చి తెగ మెచ్చుకొంటుంటారు. అప్పటప్పట ఆ పిల్ల చేత పాడించి విన్పిస్తారు. అటువంటి సందర్భాలలో ఒకసారి గోపాలం అక్కడ ఉండడం జరిగింది. సీత పాట విన్నాక శాంత విషయంలో తను గుర్తించిన విషయాన్ని

మనసులో దాచుకోలేక 'మీ పెద్దమ్మాయి కూడా బాగా పాడుతారు" అన్నాడు ఆ పరిసరాల్లోనే ఉన్న శాంత వంక చూస్తూ.

"ఎవరు? మా శాంతా.... అయ్యో రామా" అంటూ పెదవి విరిచింది రాజమ్మ. అక్కవంక చూసి 'అవునా' అని కవ్విస్తున్నట్లు చిన్నగా నవ్వింది సీత.

ఆ సమయంలో శాంత కళ్లలో ప్రతిఫలించినంత మానసిక క్షోభని గోపాలం ఎప్పుడూ అనుభవించి ఉండడు. కనీసం ఊహించుకోనైనా ఊహించుకొని ఉండడు. అనవసరంగా ఆ విషయం ఎత్తి శాంతని బాధపెట్టేనని విచారించేడు. ఆ సమయంలో శాంత మనసుకి ఉపశమనం కలిగేలా ఏదో ఒకటి అనాలనిపించింది అతడికి.

"ఏమో... నా మట్టుకు మీ శాంతపాట ఎంతో బాగుంటుంది" అన్నాడు శాంత వంక క్రీగంట చూస్తూ.

శాంత ముఖం గోపాలం మాటతో విప్పారింది. అప్పుడే విచ్చుకొంటున్న గడ్డిపువ్వు అయినా అందంగానే ఉంటుంది. తన కూతురివంక అప్యాయంగా, జాలిగా చూసేడు రంగనాథం.

గోపాలానికి శాంతపట్ల అభిమానం కలుగడానికి ఆ ఇంట్లో ఆమె పొందుతున్న నిరాదరణే చాలవరకు కారణం అనవచ్చు. తనకన్న చదువు, అందం, ఆరోగ్యం అన్నీ వున్న చెల్లెలు క్షణక్షణానికి ఏదో రూపంగా ఎదుటివారి నుంచి మెప్పులు అందుకొంటుంటే, ఆ అక్కది ఎంత పట్టించుకొనే స్వభావం కాకపోయినా ఏదో సమయంలో బాధపడకపోదు. అసూయతో ఆ చెల్లెలి పుట్టుకను తిట్టుకోకపోదు. శాంతలో చెల్లెలిపట్ల అటువంటి అసూయ ఉందో, లేదో గోపాలానికి తెలియదు. భూదేవిలా అన్ని అనుభవాల్ని నిర్లిప్తతగా మోస్తూ ఓర్పుతో బ్రతకడమే ధ్యేయంగా పెట్టుకొన్న మనిషిలా అతనికి కన్పిస్తుంది శాంత.

అభిమానం కాని, అపకారం కాని ఎల్లకాలం ఒక వైపునుంచే అంది పుచ్చుకొంటూ ఉండిపోవడం జరగదు. ఏదో ఒక సమయంలో బదులు తీర్చాలనే కోర్కె కలగక మానదు. శాంతకి, గోపాలానికి మధ్య అభిమానం ఇచ్చి పుచ్చుకొనే

వస్తువుగా మారి ఒక సంవత్సరం అయింది. ఈ పరదా విషయం అప్పుటప్పుట కంటపడినా రాజమ్మ అంతగా పట్టించుకొనేదికాదు. బహుశ తన కూతురిపట్ల ఆమెకి గల నమ్మకమే అందుకు కారణం కావచ్చు. లేక గోపాలం గురించి తన అంచనా తప్పు అవదన్న ధీమావల్ల కావచ్చు. కారణం ఏదైనా వారి స్నేహం గురించి ఆమె ఎటువంటి అభిప్రాయం బయట పెట్టకుండానే గడుపుకుపోసాగింది.

రెండో సంవత్సరంలో కాలుపెట్టేసరికి గోపాలానికి కాలేజీ జీవితం కొంత వంటపట్టింది. ఆడపిల్లల వంక ధైర్యంగా చూడ్డం. చమత్కారంగా మాట్లాడడం నేర్చుకొన్నాడు.

సీత ఆ సంవత్సరంలో హైస్కూలు చదువుకి హారతి పాడింది. వచ్చిన సంగీతాన్ని కష్టపడి అభివృద్ధి పర్చుకోవాలని నిశ్చయించుకొంది. ఆ నిశ్చయానికి నాందిగా ఆ ఊళ్లో వున్న సంగీత పాఠశాలలో చేరింది. సంగీత పాఠశాల గోపాలం కాలేజీకి ఫర్లాంగు దూరంలో ఉంది. ఇద్దరికీ ఒకటే వేళలు. కలిసి వెళ్లి వస్తుండే వారు. ఆ విధంగా సీతతో స్నేహం ఏర్పడ్డాక గోపాలం అంతకుపూర్వం ఆ పిల్లపట్ల ఏర్పరచుకొన్న కొన్ని అభిప్రాయాలు మార్చుకొన్నాడు. శాంతపట్ల తనకిగల అభిమానం వల్ల సీతని చిన్నచూపు చూసేడని తెలుసుకొన్నాడు.

ఆ సంవత్సరంలో మరో మూడు నెలలు గడిచేసరికి గోపాలానికి శాంతపట్ల అభిమానంతో పాటు, సీతపట్ల ఆకర్షణ కూడా తలమునకలుగా పెరిగిపోయింది. రోజులు నిముషాల్లా దొర్లిపోయేయి. ఎంతో దూరం ఉందనుకొన్న సంక్రాంతి ఇట్టేవచ్చి ఇంటిముంగిట నిల్చింది. తను చదువుకోవలసింది చాల ఉందని, అందుచే ఆ సెలవలకి ఇంటికి రావడం పడదని గోపాలం తండ్రికి ఓ ఉత్తరం రాసి పడేసేడు. కొడుక్కి చదువుపట్ల కుదరిన శ్రద్ధకు ఆ తలితండ్రులు ఎంతో సంతోషించేరు. పండుగపూట ఇంత మిఠాయి అయినా కొనుక్కొని తినమని ఎవరో తెలిసినవారు ఆ ఊరు వస్తుంటే వారిచేత కొడుక్కి కొంచెం సొమ్ము పంపించేడు.

ఆ సొమ్ముతో గోపాలం సీతకొక పౌడరుడబ్బా కొన్నాడు. శాంతకొక

పాటలపుస్తకం కొన్నాడు. సీత ఆ పౌడరు రాసుకొని ముచ్చటపడుతుంటే శాంత ఆ పుస్తకంలోని పాటలు పాడుతుంటే గోపాలం మనసు ఉత్సాహంతో ఉరకలు వేసింది.

ఆ సంవత్సరం మొదట్లో ఎవరో స్నేహితుడు గోపాలనికి ఒక కేలెండరు ఇచ్చేడు. ఇటు శ్రీదేవి, అటు భూదేవి, మధ్యని శంఖచక్రధారియైన విష్ణుమూర్తి అందుమీద వున్న బొమ్మ ఇది. శ్రీదేవి తన కొంచెచూపులతో విష్ణుమూర్తిని కవ్విస్తున్నట్లుంది. భూదేవి తన అంచంచల ఆరాధనలతో నారాయణుని వశపర్చుకొంటునట్లుంది. ఇద్దరు భార్యలను ముద్దుగా దగ్గరికి తీసుకొని అనురాగసుధలు వర్షింపచేస్తున్నట్లు చిన్నగా నవ్వుతున్నాడు శ్రీమన్నారాయణుడు.

ఆ కేలెండరు పైనున్న బొమ్మ గోపాలానికి నచ్చింది. తన పక్కకి అటువైపున వున్న గోడకి ఒక మేకు కొట్టి దానిని తగిలించేడు. సంక్రాంతి సెలవల్లో చదువుకి పోగా మిగిలిన కాలాన్ని ఆ బొమ్మని చూస్తూ అలా గడిపివేయడం అలవాటు చేసుకొన్నాడు. రోజురోజుకి ఆ చిత్రం తనకేవో కొత్త సంగతులు చెప్తున్నట్లు కొత్త రూపులు దిద్దుకొంటున్నట్లు అనిపించేది గోపాలానికి.

ఆరోజు సంక్రాంతి రాజమ్మగారింట వారం. ఇంకా భోజనాలకి బాగా సమయం ఉంది. ఏమి చేయడానికి తోచక గోపాలం విష్ణుమూర్తి బొమ్మని చూస్తూ కూర్చున్నాడు. ఆ బొమ్మని అలా చూస్తుంటే అతనికి ఒక తమాషా అయిన కోర్కె కలిగింది. సన్నగా ముల్లు చెక్కిన పెన్సిలు ఒకటి తీసుకొని శ్రీదేవి చీర మడతల్లో సీతపేరు, భూదేవి పాదాలవద్ద శాంతపేరు అతిచిన్న అక్షరాలతో అందంగా రాసేడు. చిరునవ్వులు చిలికిస్తున్న విష్ణుమూర్తి చేతనున్న చక్రం మధ్యగా తన పేరు రాయబోతుంటే రాజమ్మ ఏదో పని తిన్నగా చెయ్యలేదని శాంతమీద కస్సుమని లేచింది. ఆమె కేకతో గోపాలం తుళ్ళిపడ్డాడు. చేతిలో ఉన్న పెన్సిలు కిందపడి ముల్లు విరిగి ముక్కలయింది. అతడి మనసులోని ఉత్సాహం కూడా విరిగిన ఆ ముల్లులాగే చిన్నాభిన్నం అయిపోయింది. దిగాలుపడి మంచంమీద వాలిపోయేడు గోపాలం.

తల్లి కేకలకి శాంత పెదవి కదలి జవాబు చెప్పలేదు. తలవంచుకొని మౌనంగా

తనకి చెప్పిన పని చేసుకుపోసాగింది. "భూదేవి... భూదేవి" అనుకొన్నాడు గోపాలం కేలండరులో ఉన్న బొమ్మవంక చూస్తూ.

అంతలో వచ్చింది సీత! తలంటు పోసుకొన్న జుట్టుతో, తల్లో పువ్వులతో, కొత్త చీరతో, సరికొత్త అందాలతో, ఆ పండగపూట ఆ ముస్తాబులో మిలమిల మెరసిపోతున్న సీతవంక కన్నార్పకుండా చూసేడు గోపాలం.

"గోపాలం! ఈ రంగుచీర నాకు బాగుందా... లేదా?" చనువుగా ప్రశ్నించింది సీత.

గోపాలం కేలండరువంక చూసేడు. శ్రీదేవి చీర కుచ్చెళ్లలో తను పదిలంగా రాసిన సీత పేరు భద్రంగా ఉంది. అటు నుంచి దృష్టి తిప్పి సీతను తృప్తిగా చూసేడు.

"నేను ఇక్కడుంటే అటు చూస్తావేం"? సీత అలకతో మూతిబిగించింది.

గోపాలం కంటికి ఆ కోపంలో సీత మరీ అందంగా కన్పించింది.

"చాలా బాగుంది. ఈ లేతగులాబి రంగు నీ ఒంటికి ఎంతో నప్పింది" అన్నాడు గోపాలం.

సీత తన చీరవంక ముచ్చటగా చూసుకొంది.

"అక్కకి ఏ రంగుది కొన్నారు" గోపాలం తన కుతూహలాన్ని దాచుకోలేక అడిగేడు.

"ఏమో నాకేం తెలుసు? కొన్నది నాన్నగారు. కొనిపించుకొనేది ఆవిడ" అంది సీత – చరచర అక్కడినుండి వెళ్లిపోతూ.

రమారమి రెండేళ్లుగా ఆ ఇంటి విషయాలు ఆకళింపు చేసుకొంటున్న గోపాలం ఎవర్నీ అడక్కుండానే ఊహించుకొన్నాడు. చివరకి తలిదండ్రులకి కూడా ఈ పక్షపాత బుద్ధి ఉంటుందన్నమాట. పెట్టినా పెట్టకపోయినా పెదవి కదపని శాంతలాంటి పిల్లల్ని చూస్తే వారికి లోకువే. అందచందాలు లేని శాంత ఏ చీరలో ఉన్నా ఒక్కలాగే ఉంటుందని ఊరుకొని ఉంటారు. చెల్లెలితోపాటు తనకో చీరకొంటే పండుగపూట శాంత కట్టుకోదూ? చినుగుపట్టిన ఆ పాత చీరతో ఎందుకుంటుంది

అనుకొన్నాడు.

సాయంకాలం రాజమ్మ, సీత పసుపు కుంకాలు పంచడానికి వెళ్లేరు. తల్లితో శాంత వెళ్లలేదు. శాంత ఎక్కడికీ వెళ్లదు. అసలు ఆ పిల్లకి అటువంటి సరదాలు లేవు. కూతుర్ని రమ్మని రాజమ్మ కూడా బలవంతం చెయ్యదు.

రంగనాథం వీధి అరుగుమీద పండుగ పేకాట సందడిలో ఉన్నాడు. ఏమీ తోచని గోపాలం వాకిట్లో ఇటుఅటు పచార్లు చేస్తున్నాడు. శాంత కాని కన్పిస్తే పలుకరించి తన సానుభూతి తెలియజెయ్యాలన్న కోర్కె అతడి మనసులో అంతర్గతంగా ఎక్కడో మెదలుతున్నది. అదే సమయంలో పక్క గదిలోంచి బైటకి వచ్చింది శాంత.

కొత్తచీర కట్టుకొని, ఒదులుగా జడ వేసుకుంది. మెడలో ఏవో నగలు, ముఖానికింత పౌడరు. జడలో పెద్దపూల చెండు. కంటి కొసలను సాగదీస్తూ సన్నగా దిద్దిన కాటుకరేఖ... ఆమెని ఆశ్చర్యంగా కిందనుండి మీద వరకు చూస్తూ "ఏమిటీ వేషం శాంతా" అన్నాడు గోపాలం

"ఏం బాగులేదా? నీకు నచ్చలేదా?" సూటిగా అతడి కళ్లలోకి చూస్తూ ప్రశ్నించింది శాంత.

"ఇంతకన్న నువ్వు రోజూలా నిరాడంబరంగా ఉన్నప్పుడే నాకు బాగుంటావు. ఈ వేషంలో... ఈ అలంకరణలో ... అబ్బా ... అవన్నీ తీసిపారేయ్ శాంతా! తలలో మరీ వెర్రిగా అన్ని పువ్వులు పెట్టుకొంటే ఏం బాగుంటుంది? రోజులా ఒకటో... రెండో పెట్టుకుంటే సరిపోదా" విసుగుతో కూడిన మందలింపుగా అన్నాడు గోపాలం.

ఆ విధంగా ఆ పిల్ల వేషభాషల్ని శాసించే హక్కు తనకి ఉందా... లేదా అని ఆ సమయంలో అతడు ఆలోచించలేదు. శాంత నిరాడంబరంగా ఉంటే కొంతనయంగా ఉంటుంది. పిచ్చిగా చెల్లెల్ని అనుకరిస్తూ తనకున్న కొద్దిపాటి అందాన్ని ఆమె అలా నాశనం చేసుకోడం అతడు సహించలేకపోయేడు.

"ఇలా అలంకరించుకొంటే నీకు బాగుంటుందనుకొన్నాను" అంది శాంత.

తప్పుచేసిన దానిలా తలవాల్చి, కింది పెదవి పైదానితో నొక్కిపెడ్తూ.

"నాకు బాగుంటుందా? ఉన్న అందాన్ని అలంకారం పేరుతో ఇలా నువ్వు పాడుచేసుకొంటుంటే నాకు ఇష్టమా? ఎవరు చెప్పేరు శాంతా, నీతో ఈ మాట ఎవరు చెప్పేరు?" ఉద్రేకంగా, బాధగా అన్నాడు గోపాలం.

"ఎవరూ చెప్పలేదు... ఎందుకో నేనే అలా అనుకొన్నాను" అంది శాంత నెమ్మదిగా

ఆమె అన్నమాటలో నిజం లేకపోలేదు. తల్లో అన్ని పువ్వులు పెట్టుకుంటే, ఒదులుగా జడ వేసుకుంటే, ముఖానికింత పౌడరు పులుముకుంటే గోపాలానికి ఇష్టమని శాంతతో ఎవరూ చెప్పలేదు. కాని ఎందువల్లో ఆమెకి అలా అనిపించింది. ఆ విధంగా అలంకరించుకొన్న సీతతో గోపాలం చాలాసార్లు సరదాగా నవ్వుతూ మాట్లాడడం చూసింది శాంత. తనకి సన్నిహితంగా ఉండే ఒకే ఒక వ్యక్తి ఈ అలంకరణ మూలంగా దూరం అయిపోతాడేమోఅన్న ఆరాటం ఆమెలో ఆ తెగువని ప్రవేశపెట్టింది. అలవాటుకి భిన్నంగా ఆమెచే ఆ వేషం వేయించింది.

మారుమాట లేకుండా తలవంచుకొని ఇంట్లోకి వెళ్లిపోయింది శాంత... పండుగ పూట ఆమె మనసుని అలా కష్టపెట్టినందుకు ఎంతగానో నొచ్చుకున్నాడు గోపాలం. అరగంట తరువాత తరిగి వచ్చిన శాంత ముఖంలో అంతకు కొద్దిసేపటి క్రితమే ఎంతో కష్టపడి చేసుకొన్న అలంకరణ చిహ్నాలు మచ్చుకైనా కనరాలేదు. నిజంగా శాంత అలా అలంకరించుకొందా లేక పక్కచుట్టకి చేరబడి కనుమూసి తను కలకాని కన్నాడా అని ఆలోచనలో పడ్డాడు గోపాలం.

తరువాత అటువంటి అలంకరణతో శాంతని గోపాలం ఎప్పుడూ చూడలేదు. ఒకటి, రెండుసార్లు పెళ్లిచూపులకి ఎవరో వస్తున్నారంటూ రాజమ్మ శాంతని ముస్తాబు చెయ్యకపోలేదు. కాని ఆ అలంకరణలో అటు తల్లికి కాని, ఇటు కూతురికి కాని పెద్దగా అభిప్రాయం ఏమీ ఉండేది కాదు.

గోపాలం బియ్యే పరీక్షలు రాసే ముందు శాంతకి ఏదో సంబంధం వచ్చింది.

అదివరలో వచ్చి వెళ్లిన అందరిలాగే వీరూ ఇంటికి వెళ్లి పిల్ల నచ్చలేదంటూ ఒక పంక్తి ఉత్తరం వ్రాసి పడేసేరు. కాదంటే తాజా కలంగా దానికి మరో మాట జతచేసేరు.

"ఏమన్నారు?" అంటూ ప్రశ్నించేడు గోపాలం

"అందరూ అంటున్నమాటే... చిన్నపిల్లనిస్తే చేసుకొంటారుట" అంది రాజమ్మ నిట్టూరుస్తూ.

"నేనోమాట చెప్తాను వింటారా?" అన్నాడు గోపాలం సందేహిస్తూ, అతడి మాటలో ఏదో ఆశ తొంగిచూస్తున్నట్లు అనిపించింది రాజమ్మకి. అతడికి ఇష్టమైన మెంతి పెరుగు మరికాస్త విస్తట్లో వడ్డిస్తూ "ఏమిటి నాయనా చెప్పు... దాని మెడలో ఆ మూడుముళ్లు పడ్డానికి ఎవరేం చెప్పినా వింటాము. ఏం చెయ్యమన్నా చేస్తాము" అంది.

"సీతకు ముందు పెళ్లి చేసేయండి. అప్పుడు పిల్లని చూసుకొంటాం అంటూ ఇంటికొచ్చిన వారికి ఇటువంటి కుంటిసాకులు చెప్పి శాంతని అవమానపరిచే అవకాశం ఉండదు" అన్నాడు గోపాలం.

పెద్దదానికి కాకుండా చిన్నపిల్లకి పెళ్లా? రాజమ్మ ముఖం దిగులుగా వాలిపోయింది.

అటు తరువాత కూడా శాంతకి ఎన్నో సంబంధాలు వస్తూనే ఉండేవి. వెళ్తూనే ఉండేవి. పిల్లకి ఇంక పెళ్లి కాదేమో అన్న భయం పట్టుకుంది రాజమ్మకి. ఎవడో ఒకడు మగవాడన్నవాడు కన్పిస్తే చాలు వాడి చేతుల్లో పెట్టి బాధ్యత వదుల్చుకోవాలన్న స్థితికి వచ్చింది.

"ఇంక శాఖా, గీఖా ఏదీ చూసేదిలేదు నాయనా! పిల్లడు ఆరోగ్యంగా ఉండి దాని కడుపుకింత అన్నం పెట్టగల తాహతు ఉంటే చాలు. నీ ఎరికలో ఎవరైనా ఉంటే చూసిపెట్టు బాబూ" అంది రాజమ్మ ఒక రోజు భోజనాల సమయంలో.

"శాంత పెళ్లికోసం మీరింతగా ఎందుకు కంగారు పడ్తున్నారో నాకు అర్థం కావడం లేదండీ. శాంతకి మొగుడు కావలసినవాడు ఇప్పటికే ఎక్కడో అక్కడ పుట్టి

వుంటాడు కాని ఇక ముందు పుట్టబోదుకదా, ఆ కల్యాణ శుభసమయం కలసివస్తే తనంతట తనే దిగివస్తాడు.

ఇంతకి శాంతకి ఏమంతవయసు మీరిందని... " అన్నాడు గోపాలం తిన్న విస్తరి మడచి లేచిపోతూ.

"ఏదో నాయనా! నీ నోటి చలవ వల్ల అంత మాట ఎప్పటికైనా పుడ్తే.... అదే పదివేలు" అంది రాజమ్మ

గోపాలం పరీక్షలు పూర్తయేయి. "బాగా చేసేను. పాసవుతా" నన్న ధైర్యంతో సామాన్లు సర్దుకొని ఇంటికి బయలు దేరేడు. అతడు సామాన్లు సర్దుకొంటుంటే ఆ పాత కేలండరు తనకి కావాలంది శాంత

"ఏం చేసుకొంటావు... రంగులు కూడా వెలిసిపోయేయి" అన్నాడు గోపాలం

ఆ మాటకి శాంత ఏమి జవాబు చెప్పలేదు. దానిని భద్రంగా తన గదిలోకి తీసుకుపోయింది. చిన్న తమ్ముడి రేకుపెట్టెలో నుంచి చిన్న పెన్సిలుముక్క తీసి విష్ణుమూర్తి గుండెలమీద గోపాలం పేరు పట్టిపట్టి తనకు చేతనైనంత అందంగా రాసింది. శ్రీదేవి ముఖం మీద అడ్డంగా నిలువుగా నాలుగు గీతలు పెట్టింది. ఆ కేలెండరుని గుండ్రంగా చుట్టబెట్టి చిన్న పురితాడుతో విడిపోకుండా ముడివేసి తన బట్టలమధ్య దాచుకొంది.

తన ఊరుకి వెళ్లిన నాలుగు నెలలకి గోపాలం దగ్గర నుంచి ఉత్తరం వచ్చింది. అతడికి తాలూకా కచేరిలో ఉద్యోగం అయిందంటూ" వారం పదిరోజుల్లో వచ్చి ఛార్జి తీసుకొంటున్నాను. మిమ్మల్నందర్నీ మళ్లీ చూడ్డం అవుతున్నందుకు నాకు సంతోషంగా ఉంది" అంటూ రాసేడు. ఉత్తరం చివర "శాంత కులాసాగా ఉందా?... అడిగేనని చెప్పండి" అంటూ మరో పంక్తి పొడిగించేడు.

ఉత్తరంలోని ఆ చివరి వాక్యం రాజమ్మ మనసులో ఎన్నో ఆలోచనల్ని రేకెత్తించింది. గోపాలం తమ ఇంట కాలుపెట్టిన నాటినుండి శాంతపట్ల అతడు కనబరచిన అభిమానం, ఆమె పనిపాట్లపై అతడు చూపించిన ఆసక్తి రాజమ్మలో

ఏవేవో ఆశలు కల్పించేయి. చివరి రోజుల్లో శాంతపెళ్లి గురించి ఆమె బాధపడుతుంటే 'శాంత మొగుడు పుట్టేవున్నాడు కాని పుట్టబోడు కదా ఆ సమయం కలసివస్తే వాడే దిగివస్తాడు" అంటూ ధైర్యం చెప్పడం గుర్తుకొచ్చింది.

"గోపాలం ఏ ఉద్దేశంతో ఈ మాట రాసేడో! ఎందుకైనా మంచిది అతడి తలిదండ్రులకి ఒక ఉత్తరం రాసి పడేయండి" అంది రాజమ్మ భర్తకి తన ఆలోచన తెలియజేస్తూ.

"మీ పిల్లడి మంచిచెడ్డల గురించి మాకు తెలుసు. అలాగే మా అమ్మాయి శాంత గురించి మీ గోపాలానికి బాగా తెలుసు. మీకు అభ్యంతరం లేకపోతే గోపాలాన్ని మా ఇంటి అల్లుడిగా చేసుకోవాలను కొంటున్నాము" అంటూ రంగనాథం గోపాలం తండ్రికి ఒక ఉత్తరం రాసేడు. నాలుగు రోజుల తరువాత వారి నుంచి జవాబు వచ్చింది. ఉత్తరం చదువుతున్న భర్త ముఖవళికల్ని పరీక్షించడానికి ప్రయత్నిస్తూ "ఏమన్నారు? మనతో వియ్యమందడానికి ఇష్టపడ్డారా" అంటూ ఆత్రంగా ప్రశ్నించింది రాజమ్మ.

"ఆ... దానికి వారికేం అభ్యంతరం లేదుట..."

రాజమ్మ ముఖం చిలికి చాటంతయింది.

" ఈ విషయం నాకు ముందునుంచే తెలుసండీ. గోపాలానికి శాంత అంటే ఎంత ఇష్టం. దాని వంట మెచ్చేడు. దాని పాట మెచ్చేడు. చివరకి మొన్న ఉత్తరంలో కూడా శాంత క్షేమం అడిగేడు కాని సీత విషయం మాటవరసకైనా రాసేడా? ఇంతకీ నా తల్లి అదృష్టవంతురాలు. ఉత్తముడైనవాడు, దానిమీద అభిమానం ఉన్నవాడు మొగుడుగా దొరుకుతున్నాడు... ఆ రోజు ఆ పిల్లడు 'అమ్మా పట్టెడు అన్నం' అంటూ వచ్చినప్పుడే ఏదో బాంధవ్యం ఉన్నట్లు నా మనసు బాధపడింది. ఆ భగవంతుడే ఇలా నా గుమ్మానికి పంపే...."

రాజమ్మ గుక్కతిప్పుకోకుండా తన ఆనందాన్ని, ఆలోచనల్ని అలా చెప్పుకుపోతుంటే...."ఇంక చాలించు నీ ధోరణి. గోపాలం చేసుకొంటానన్నది

శాంతని కాదు సీతని" అన్నాడు రంగనాథం భారంగా. "ఏమన్నారు?"తన చెవుల్ని నమ్మలేనట్లు తిరిగి ప్రశ్నించింది రాజమ్మ. ఇదంతా చూస్తుంటే సీతకి ముందుగా పెళ్లి చెయ్యడమే మంచిపనిలా అన్పిస్తున్నది" అన్నాడు రంగనాథం దిగులుగా.

"కన్నతండ్రి మీరూ ఆ మాటే అంటున్నారా" అంది రాజమ్మ కంటతడితో.

"ఏం చెయ్యడం రాజూ! కొన్ని నిజాలు చేదుగా ఉంటాయి. ఒక విధంగా ఆ చేదు కూడా ఒంటికి మంచిదే. బజార్లో ఒకే వెలకి రెండు వస్తువులు దొరుకుతుంటే మంచిదాన్ని ఎన్నుకోడం మానవ నైజం" అన్నాడు రంగనాథం భార్యని ఓదారుస్తూ.

అమాయకురాలు శాంత ఆ నిజంలో చేదును అప్పుడే రుచి చూసింది. పెట్టిలో భద్రంగా దాచుకొన్న విష్ణుమూర్తి కేలెండరు తీసింది. విష్ణుమూర్తి అనురాగంగా చిరునవ్వులు ఒలకపోస్తున్నాడు. శాంత క్షణకాల విష్ణుమూర్తి, శ్రీదేవి బొమ్మలవంక పరీక్షగా చూసింది. "అబద్ధం... అంతా మోసం" అంటూ విష్ణుమూర్తి శ్రీదేవి బొమ్మల్ని కసిగా చింపి చిన్న, చిన్న ముక్కలుగా చేసి పోగులుపెట్టింది. మిగిలిన భూదేవి బొమ్మ కింద "భూదేవి ఎంతో మంచిది. అందరికి అన్నం పెడ్తుంది" అని రాసుకొని కన్నీళ్లతో తడిపి పెట్టిలో భద్రంగా దాచుకొంది.

...

అవును... భూదేవి ఎంతో మంచిది. అందరికి అన్నం పెడ్తుంది. అలసి, సొలసి ఉన్నవారిని తన ఒడిలో సేదదీర్చి నిద్రపుచ్చుతుంది. కాని దాన్ని కాళ్లతో తన్నుకుంటూ పోతాడు మనిషి.

శ్రీదేవి తన ఆడంబరంతో, ఆకర్షణలో అందర్నీ వశపర్చుకొంటుంది. అయిన వాళ్ల మధ్య కూడా కలతలు రేపుతుంది- తను తప్పిస్తే వేరేలోకం లేదన్న భ్రమకల్గిస్తుంది. అయినా దానిని నెత్తిమీద పెట్టుకు పూజిస్తారు. దాని కటాక్షం కోసం ఏ పనైనా చేస్తాము. ఇది లోక ధర్మం. గోపాలం కూడా దానికి అతీతుడు కాడు.

- దీపావళీ ప్రత్యేక సంచిక, 1968, యువ